
# కాళ్లకూరికి జిల్లా ఉగాది పురస్కారం

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 20;**ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం శివాలయం అర్చకులు ప్రముఖ శైవాగమ పండితులు కాళ్లకూరి సత్యనారాయణమూర్తికి ఉత్తమ అర్చకులుగా ఉగాది పురస్కారం దక్కింది. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగింది.జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆర్డీవో జి.మమ్మీ లు ఆయనను సత్కరించి ఈ పురస్కారం అందించారు.పురష్కారం అందుకున్న కాళ్లకూరిని ఆలయ చైర్మన్ ఉప్పులూరి సత్తిపండు,ఇవో ఎమ్.శివరామకృష్ణ లు అభినందించారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఘనంగా బండారు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 20;**జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆలమూరులో ఘనంగా నిర్వహించారు. ఆలమూరు మండల జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముందుగా స్థానిక జనార్ధన స్వామి ఆలయంలో బండారు శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలమూరు బస్టాండ్ వద్ద ఉన్న జనసేన పార్టీ స్తూపం వద్ద భారీ కేకును ఏర్పాటు చేసి మండల నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జై బండారు శ్రీనివాస్ జై జనసేన పార్టీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు స్వీట్స్ పంపిణీ చేశారు. బండారు శ్రీనివాస్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య,నాయకులు సంగిత సుభాష్, నల్లా వెంకన్న,గారపాటి శ్రీనివాస్ చౌదరి, కొత్తపల్లి నగేష్, సలాది జయప్రకాష్ నారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, మెండు శ్రీను, అడబాల వీర్రాజు, చింతలపూడి



శ్రీనివాస్ భావన శివశంకర్, తోరాటి నాని, నాగిరెడ్డి శ్రీను, గోపు గోపాలకృష్ణ,కట్టా రాజు,సిరిగినేడి పట్టాభి, గుత్తుల నాగేశ్వరరావు, దాసరి వీరపండు, చీకట్ల సతీష్, డిపి రావు, చిన్న, ధనరాజు, గౌర్రిపూడి పెదకాపు, గోళ్ళ ప్రభాకర్, నాగిరెడ్డి మహేష్, గార్లపాటి బాలాజీ,పెద్దిరెడ్డి పట్టాభి,నామాల సుబ్బారావు, వీర మహిళలు కోట వరలక్ష్మి, శ్రీపతి వీరవేణి,సబ్బవరపు రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ కాళబైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 20:**మాచవరం శ్రీ రామ్ ఘాట్ నందు వేంచేసియున్న శ్రీ పార్వతీ రాజేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీ కాళ బైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అంబాజీపేటకు చెందిన పెదమల్లు సత్యవెంకట రామప్రసాద్, సునీత దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు మాచరి సూరిబాబు, రాజా ఆధ్వర్యంలో శ్రీ కాళభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# చింతలూరు నూకాంబికా ఆలయ ఈవోకు ఘన సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 20;**చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరిని గ్రామానికి చెందిన మహిళా భక్తబృందం, నాయకులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆలయంలో తూర్పు, పడమర రాజగోపురాల నిర్మాణానికి, ముఖమండపం, ప్రాకార మండపం తదితర అభివృద్ధి పనులకు సంకల్పం చేసి ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పూర్తి చేయడంలో ఈవో పాత్ర ప్రశంసనీయమని వారంతా కొనియాడారు. తూర్పురాజగోపురం నిర్మాణదాత దాసరి గణేశ్వర్రావు తండ్రి దాసరి వెంకట్రావు (బాబూరావు)ను వారంతా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ వీరి అప్పారావు గౌడ్, సభ్యులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో నేడు రంజాన్ ప్రార్థనలు

## ఈద్గా మెట్టపై సామూహిక నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తి



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 20:** పవిత్ర రంజాన్ మాసం ముగింపును పురస్కరించుకుని శనివారం పెద్దాపురం పట్టణంలో ముస్లిం సోదరులు 'ఈదుల్ ఫితర్' వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో నెల రోజుల పాటు సాగిన కఠిన ఉపవాస దీక్షలు ముగిశాయి. పట్టణ శివారు కట్టమూరు పుంతలోని ఈద్గా మెట్టపై శనివారం ఉదయం 9:00 గంటలకు సామూహిక నమాజ్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా షాహీ జామియా మసీదు ఇమామ్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ శాంతి, సోదరభావంపై ధార్మిక ప్రసంగం చేస్తారు. అనంతరం దేశాభివృద్ధి, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేక 'దువా'లు నిర్వహించనున్నారు. పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పెద్దాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. విజయశంకర్ ఆధ్వర్యంలో తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా ఈద్గా మెట్ట పరిసరాలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించి, అవసరమైన సౌకర్యాలు కల్పించిన మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి ముక్తార్ అలీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# బుర్రకథ కళాకారుడు కృష్ణమూర్తికి 'కళారత్న' అవార్డు



## మంత్రి సుభాష్ అభినందనలు

**రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 20:** బుర్రకథ కళకు విశిష్ట గుర్తింపు తీసుకొచ్చిన కళాకారుడు గొర్రెల కృష్ణమూర్తి ప్రతిష్టాత్మక 'కళారత్న' (హంస అవార్డు) అందుకున్నారు. ఈ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్వీకరించారు.అవార్డు అందుకున్న అనంతరం కృష్ణమూర్తి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బుర్రకథ రంగంలో రెండు హంస అవార్డులు అందుకోవడం రామచంద్రపురం ప్రాంతానికి గర్వకారణమన్నారు.గత 53 సంవత్సరాలుగా బుర్రకథ ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లుతూ కృష్ణమూర్తి చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని తెలిపారు. గత ఏడాది కృష్ణమూర్తి సోదరుడు గొర్రెల రాము కూడా ఇదే అవార్డు అందుకోవడం విశేషమని, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కళాకారులు ఈ గౌరవం పొందడం అరుదైన విషయం అని మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం,గరికపాటి సూర్యనారాయణ,కంచుమర్తి బాబురావు,బలుసు శివప్రసాద్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మధ్యాహ్న భోజన పథకంపై మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ

## విద్యార్థులతో కలిసి భోజనం


**రామచంద్రపురం , పెన్ పవర్, మార్చి 20:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్ హైస్కూల్‌ను సందర్శించిన మంత్రి, అక్కడ విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా తెలుసుకున్నారు. "భోజనం రుచిగా ఉందా? సరిపడినంతగా పెడుతున్నారా?" అంటూ విద్యార్థులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే చదువుల పరిస్థితి, పరీక్షల సన్నాహకంపై కూడా మంత్రి ఆరా తీశారు. ఆకస్మికంగా పాఠశాలకు వచ్చిన మంత్రి సుభాష్‌ను చూసి ఉపాధ్యాయులు,విద్యార్థులు ఆశ్చర్యానికి గురయ్యారు.ఆయన సందర్శన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మంత్రి సుభాష్ పేర్కొంటూ,ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పై అవగాహన




**కాకినాడ, పెన్ పవర్,మార్చి 20:** ప్రపంచ ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు కోరింగ అభయారణ్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు (ఐఎఫ్ఎస్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చుకలు అంతరించిపోతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి సంరక్షణలో మానవుల పాత్ర కీలకమని, అవగాహన కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ మడ అడవులు కాకినాడను ప్రకృతి వైపరీత్యాల నుంచికాపాడుతున్నాయని, వాటిని సంరక్షించడం అత్యవసరమని పేర్కొన్నారు.కాలుష్యాన్ని తగ్గించి ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని పిలుపునిచ్చారు.జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని ఎం. సుసత్య రేఖ, బర్డ్ కన్జర్వేషన్ నిపుణుడు మృత్యుంజయ రావు, రిటైర్డ్ అధ్యాపకులు దాలినాయుడు పిచ్చుకల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, రీసెర్చ్ సైంటిస్ట్ డి. మహేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి. తేజేశ్వర రావు అటవీ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ అభినందించారు.




## జటాద్రి కొండను ఆక్రమించుకుంటున్న భూ బకాసురుడిపై చర్యలు తీసుకోవాలి




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 20:** జగ్గంపేట రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 24 జటాద్రి కొండగా పిలవబడే కొండను బడా వ్యాపారవేత్త రైతుల పేరుతో త్రవ్వి, కబ్జా చేస్తున్న భూ బకాసురుడిపై చర్యలు తీసుకొని, కబ్జాదారులకి వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేసి తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు జగ్గంపేటలో చాలామంది ఉన్నారని వారు ఒక సెంటు భూమి చూసుకొని పూరి గుడిసెలు వేసుకుంటే తీసివేస్తున్న ఈ ప్రభుత్వ అధికారులు రాజకీయ ఆర్థిక అండదండలతో జగ్గంపేటకు చెందిన ఒక బడా వ్యాపారవేత్త గత నెల రోజుల నుంచి జటాద్రి కొండను తవ్వేస్తుంటే మండల తహసిల్దార్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రోక్లైన్ ను సీజ్ చేసి కొండను తవ్వేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. తహసీల్దార్ స్పందించి ఈ విషయం మా దృష్టికి రాలేదని ఈ విషయం మా దృష్టికి వచ్చింది కాబట్టి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే సతీష్, జిల్లా నాయకులు కే. రామలింగేశ్వర రావు, డాన్ శ్రీను, సత్తిబాబు, సూరిబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న దేవస్థానంలో టెండర్ల ప్రక్రియ



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 20:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కళ్యాణోత్సవాల ఏర్పాట్లలో భాగంగా వివిధ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఆలయ పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసుకునే 15 తాత్కాలిక షాపులకు టెండర్లు పిలవగా, కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే రావడంతో వాటికి వేలంపాట చేపట్టారు.
జెయింట్ వీల్, తాత్కాలిక షాపుల ఏర్పాటుకు సంబంధించిన టెండర్‌లో వాడపల్లి గ్రామానికి చెందిన ఏపుగంటి కృష్ణ రూ. 1,30,000కు టెండర్ దక్కించుకున్నారు. వాహనాల పార్కింగ్ స్థలానికి సంబంధించి రెండోసారి కూడా ఒక్కటే టెండర్ రావడంతో ఆ ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. అలాగే క్విక్ ఫోటోల టెండర్‌కు ఆశించిన స్థాయిలో ధర లభించకపోవడంతో దానిని కూడా నిలిపివేశారు. ఈ టెండర్ల ప్రక్రియను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. వెలిచేరు గ్రూప్ టెంపుల్స్ ఈవో ఎం. సత్యనారాయణ తనిఖీదారునిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్‌తో పాటు ఆలయ సిబ్బంది, గ్రామస్తులు ఎరుబండి రాజు, ఏపుగంటి వెంకటేశ్వరావు, ఏపుగంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారాల్లో గృహ వినియోగ గ్యాస్ వాడితే కఠిన చర్యలు



**రూరల్ తహశీల్దార్ హెచ్చరిక**

**కాకినాడ రూరల్, పెన్ పవర్, మార్చి 20 :** గృహ వినియోగానికి సంబంధించిన ఎల్పీజీ గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్. కుమారి హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామణయ్యపేట, వాకలపూడి ప్రాంతాల్లో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు నిబంధనలు పాటించాలని సూచించారు.గృహ వినియోగ గ్యాస్‌ను వ్యాపారాల్లో వినియోగించడం చట్ట విరుద్ధమని, సివిల్ సప్లైస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో మండల సివిల్ సప్లై ఆఫీసర్ ఎన్. వీరాస్వామి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె. సురేష్, ఆర్ఐ ఎమ్‌వీడీ భవాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహ మూర్తికి ఉగాది పురస్కారం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 20:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విజయవాడలో ఉగాది రోజున ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహ మూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందుకు న్నారు. విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పర్వదినం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం కుచెందిన శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు ప్రముఖ సాహితీవేత్త సీనియర్ తెలుగు లెక్చరర్,నడక కవి నల్లా నరసింహమూర్తి కి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర సుజనాత్మకత మరియు సాంస్కృతి సమితి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పురస్కారం 2026ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేశారు. మహాకవి బోయిభీమన్న అవార్డు, శ్రీ శ్రీ అవార్డులను సాధించి నానీల ప్రక్రియలో నడక అంశంపై 117 పుస్తకాలు రచించి సమాజ ఆరోగ్యానికి పాటుపడినందుకు అవార్డు లభించింది.సమాజ ఆరోగ్యానికి నిరంతరం కృషి చేసినందుకు అవార్డు లభించింది.
1971 నుండి నేటి వరకు తెలుగు సాహిత్యంలో నిరంతరం కవిత్వాన్ని రాస్తూ, నాలుగు నూతన సాహిత్య ప్రక్రియ లనురూపొందించి, కడలి కెరటాలు నాటిక ను రచించి నరసింహమూర్తి గత మూడున్నర దశాబ్దాల నుండి తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసి నట్లు పర్యటక సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ, విజయవాడ ఎమ్మెల్యే బోండా ఉమా, కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ బోడపాటి తేజస్విని నరసింహమూర్తిని అభినందిం చారు. తన సేవలను గుర్తించి ఉగాది పర్వదినాన అవార్డు ఇవ్వడం ఎంత ఆనందంగా ఉందని కవి నరసింహా మూర్తి చెప్పారు

## హెల్మెట్ ప్రాముఖ్యతపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన


**నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ-చలాన్లు**






**కాకినాడ పెన్ పవర్,, మార్చి 20**: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్పనా సెంటర్ వద్ద హెల్మెట్ ధరించిన వాహనదారుల ద్వారా హెల్మెట్ ధరించని వారికి ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించారు.జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతున్నట్లు హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. అదేవిధంగా రాష్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు.వాహనాలకు ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వినియోగించా లని, రెడ్ సిగ్నల్ వద్ద స్టాప్ లైన్ వెనుక వాహనాలను ఆపాలని సూచించారు. కాకినాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఆటోమేటిక్ ఈ-చలానా విధానం ద్వారా జరిమానాలు విధిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, సీఐ సునీల్ (పోర్ట్ పోలీస్ స్టేషన్) మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## సముద్ర స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు





**అల్లవరం,పెన్ పవర్,మార్చి 20:** అల్లవరం మండలం ఓడలరేవు సముద్రంలో స్నానం చేస్తుండగా యువకుడు గల్లంతు అయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అమలాపురం నారాయణపేట చెందిన నలుగురు యువకులు బొక్క సతీష్,గుత్తుల మనోజ్,బొక్క గణేష్,దొమ్మేటి లోకేష్ లు ఓడలరేవు సముద్ర తీరంలో రక్షణ గ్రోయిన్స్ నిర్మాణం చేస్తున్నా ప్రదేశంలో స్నానం చేస్తుండగా ప్రమాదవసాత్తు విద్యార్థి దొమ్మేటి లోకేష్ గల్లంతు అయ్యాడు.మిగిలిన ముగ్గురు స్నేహితులు సురక్షితంగా ఒడ్డుకి చేరుకోగా లోకేష్ గల్లంతు కావడంతో స్నేహితులలో ఆందోళన నెలకొని స్థానికులు సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అల్లవరం ఎస్.ఐ సంపత్ కుమార్ పోలీసు సిబ్బంది,మెరైన్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా సముద్రతీరంలో గజ ఈతగాళ్ళ సాయంతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. తమ కుమారుడు సముద్రంలో గల్లంతు అవ్వడంతో సంఘటన స్థలం వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నిరయ్యారు.

